క్లుప్తంగా

నేడు ఖురాన్ కంఠస్థ పోటీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ఆటోనగర్‌లోని ది ఆటోమొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ హాల్లో ఆదివారం 9వ రాష్ట్ర స్థాయి బాల, బాలికల ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ మొహ్మద్ దావూద్, సిటీ ఇన్‌చార్జి షేక్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో మూడు నుంచి 12 ఏళ్ల లోపు బాల బాలికలు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల ప్రత్యేక కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ ముఖ్యఅతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందిస్తారని పేర్కొన్నారు.

12న ఇన్‌స్పైర్ పోటీలు

గుణదల (విజయవాడ తూర్పు) : విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ సైన్స్ ప్రాజెక్ట్ పోటీలు ఈ నెల 12వ తేదీన ఆంధ్ర లయోల కళాశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు డీవైఈఓ కుమార్ తెలిపారు. ఈ మేరకు లయోల కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ మెంబర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన జిల్లా స్థాయి సైన్స్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పాఠశాల విద్యార్థుల నుంచి ఇప్పటికే 143 ప్రాజెక్టులు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారని వివరించారు.

శక్తి పీఠంలో సామూహిక హోమాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీ రాజ్య శ్యామలా గుప్తా నవరాత్రి మహోత్సవాలు నైనవరం ఫ్లైఓవర్ సమీపంలోని శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో శనివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజైన శనివారం అమ్మవారు లఘు శ్యామలాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, కలశ పూజ, సహస్ర నామార్చాన నిర్వహించారు. అనంతరం మూలమంత్ర హోమం చేశారు. పీఠం ఆవరణలో సామూహిక హోమాలు నిర్వహించగా, పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. 10 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో అమ్మవారు ప్రతి నిత్యం ఒక విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని పీఠాధిపతి కరుమారి దాసు (కరుణస్వామి) పేర్కొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సామూహిక లలితా సహస్ర నామ పారాయణ, అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.

పోలింగ్ స్టేషన్లు పరిశీలన



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మైలవరం నియోజకవర్గం పరిధిలోని గ్రామాల్లో వెస్ట్ ఏసీపీ పి. మురళీకృష్ణారెడ్డి, కొత్తపేట సీఐ టి. గణేష్ శనివారం పర్యటించారు. కొత్తూరు తాడేపల్లి, షాబాద్, జక్కంపూడి కాలనీలలోని 18 పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. మొత్తం 6 పోలింగ్ లొకేషన్లు, 18 పోలింగ్ స్టేషన్లు ఉండగా వీటిలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ వివరాలను సీఐ గణేష్ ఏసీపీకి వివరించారు. రాబోయే జనరల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ స్టేషన్లను పరిశీలించామని పేర్కొన్నారు. ఎటువంటి సమస్యలు రాకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేలా ముందస్తుగా పోలింగ్ స్టేషన్లను పరిశీలించామని ఏసీపీ మురళీకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

అగ్గిపుల్ల సాయి నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన పోలవరపు సాయికుమార్ అలియాస్ అగ్గిపుల్ల సాయి నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేటకు చెందిన అగ్గిపుల్ల సాయి గతంలో అనేక నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవించినా అతని ప్రవర్తలో మార్పు రాకపోవడంతో నగరం నుంచి బహిష్కరించామని పేర్కొన్నారు. నగర బహిష్కరణ జరిగినా అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు. నగరంలోకి ప్రవేశిస్తే అల్లర్లు సృష్టించి ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు సమాయత్తమవుతున్నాడనే నిఘా వర్గాల సమాచారంతో బహిష్కరణను పొడిగించినట్లు స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడుతున్న, చెడు నడత కలిగిన వ్యక్తులను ఉపేక్షించకుండా నగరం నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



కొత్తపేటలో మహిళకు సంక్షేమ కరపత్రాలు అందిస్తున్న షేక్ ఆసిఫ్ తదితరులు



పథకాల కరపత్రాలు అందిస్తున్న ఆసిఫ్

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): ఎన్నికల్లో గెలిచే అవకాశం లేకపోవటంతోనే చంద్రబాబు పొత్తుల కోసం ఆరాటపడుతున్నారని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమంలో భాగంగా మేయర్ భాగ్యలక్ష్మితో కలిసి శనివారం డివిజన్‌లో పర్యటించారు. రాయల్ హోటల్ సెంటర్ నుంచి ప్రారంభమైన పర్యటన గులాంమొహిద్దీన్‌వీధి, డ్రైన్‌వీధి, మేకలవారి వీధి, సైకంవారి వీధి, కోమలవిలాస్ సెంటర్, కేటీరోడ్డు, సుబ్బరామయ్యవీధి తదితర ప్రాంతాల మీదుగా ముందుకు సాగింది. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే పాలన అద్వితీయంగా కొనసాగుతోందని చెప్పారు. మహిళా సంక్షేమంతో పాటుగా, విద్య, వైద్య రంగాల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన పరిపాలనాదక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన నాయకత్వంలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి విజయాన్ని సాధిస్తుందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ప్రజలు మూడో సారి తమ పార్టీకి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని వివరించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నగరంలో మూడు నియోజకవర్గాల్లో తమ పార్టీ తప్పకుండా విజయం సాధిస్తుందన్నారు. పశ్చిమంలో అద్భుతమైన మెజార్టీని సాధిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చైతన్యరెడ్డి, అర్షద్, మరుపిళ్ల రాజేష్, కోటిరెడ్డి, శిరంశెట్టి పూర్ణ, ఇర్ఫాన్ నాయకులు వైఎస్సార్ సీపీ ట్రేడ్‌యూనియన్ నగర అధ్యక్షుడు విశ్వనాథ రవి, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బుదాల శ్రీనివాసరావు, శ్రీశైలం దేవస్థానం పాలకవర్గ సభ్యుడు గురుమహంతు మహేష్, నాయకులు పడాల చిన్నా, కంచిబాబు, చాన్, సోల్జర్ కౌసర్, సమీర్, శేగు వెంకటేశ్వరరావు, నరహరిశెట్టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): ప్రతిపక్ష పార్టీలు అన్ని గుంపుగా కలిసి వచ్చినా గెలిచేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అని పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్.ఆసిఫ్ తెలిపారు. 35వ డివిజన్ పెజ్జోనిపేటలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చిన స్థానిక కార్పొరేటర్, నాయకుల దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గత రెండు శాసన సభ ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అన్ని వర్గాల ప్రజల మద్దతుతో ఘన విజయం సాధించిందన్నారు. ఈ సారి కూడా పార్టీ విజయడంఖా మోగించి హ్యాట్రిక్‌తో విజయం సొంతం చేసుకోవటం ఖాయమని చెప్పారు. కార్పొరేటర్లు బుల్లా విజయ్‌కుమార్, శిరం శెట్టి పూర్ణాచంద్రావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు, నాయకులు నాగెళ్ల సంగీత్ బాబు, సుజాత దాసు,రంగరావు, చందు,దేవమణి, యూసూఫ్, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పెట్టుబడి మార్కెట్లపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సాంబశివరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పెట్టుబడి మార్కెట్లపై అవగాహన పెంచుకోవాలని స్టాక్ మార్కెట్ విశ్లేషకులు ఎం.సాంబశివరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఉమెన్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో సెబీ సౌజన్యంతో 'మహిళలు-మార్కెట్ అవకాశాలు' అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మేనేజమెంట్, కామర్స్ విభాగంలో కోర్సులను అభ్యసించే విద్యార్థులు పెట్టుబడి రంగంలోని అవకాశాలను గమనించాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్ స్థితిగతులను అవగాహన చేసుకోవాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు, ఉత్పత్తి రంగాలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అంచనాలు వేయగలిగిన వారు చక్కని అవకాశాలు పొందుతారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాలను అనుసరించి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, స్టడీ సెంటర్ కన్వీనర్ వి.శైలజ, కామర్స్ అండ్ మేనేజమెంట్ స్టడీస్ విభాగాధిపతి హేమంత్‌కుమార్, అధ్యాపకులు కల్మబేగం తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భార్య కనిపించడం లేదంటూ భర్త కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శనివారం కేసు చేశారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీ బ్లాక్ నెం 41లో చిట్టూరి సునీల్‌రాజు, స్వప్న దంపతులు నివాసం ఉంటారు. వీరికి ఇద్దరు సంతానం. సునీల్ దుర్గగుడిలో స్వీపర్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 8వ తేదీన సునీల్ తల్లికి, స్వప్నకు వాగ్వాదం చోటు చేసుకుంది. భార్య, తల్లిని ఎంత వారించినా మాట వినకపోవడంతో చేతిలోని ఫోన్‌ను నేలకేసి కొట్టాడు. మరుసటి రోజు తెల్లవారుజామున సునీల్ డ్యూటీకి వెళ్లిపోయాడు. ఉదయం 6 గంటల సమయంలో తల్లి సునీల్‌కు ఫోన్ చేసి స్వప్న ఇంట్లో కనిపించడం లేదని చెప్పింది. దీంతో ఆందోళన చెందిన సునీల్ రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

భక్తి తత్వాన్ని చాటిన కబీర్ నాటకం



కబీర్ నాటకంలోని సన్నివేశం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ సృజనాత్మక సమితి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం ప్రదర్శించిన కహాన్ కబీర్ హిందీ నాటకం భక్తి తత్వాన్ని చాటింది. కబీర్‌దాస్ భారతీయుల ఆధ్మాత్మిక గురువు. కబీర్ కాలం నాటి మనుషుల జీవన విధానం, సామాజిక పరిస్థితులను నాటకంలో పొందుపరిచారు. రచన, దర్శకత్వం బన్సీకౌల్ వ్యవహరించారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఆర్. మల్లికార్జునరావు, సాంస్కృతిక శాఖ మేనేజర్లు సీహెచ్ శ్రీనివాస్, సుమన్ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఫ్యాకల్టీ వినయ్ పాల్గొన్నారు. నేటితో భారత్ రంగ మహోత్సవ్ కార్యక్రమాలు ముగుస్తాయి. ఆదివారం కర్ణాటక వారి ఆయోధ్యకాండ నాటకం ప్రదర్శిస్తారు.

బాలుడు అదృశ్యంపై...

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాలుడు అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన లాడ్లి ఖాతూన్‌కు నలుగురు సంతానం. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విజయవాడలో నివాసం ఉంటున్న ఖాతూన్ తమ్ముడు సోనీకి ఒక కుమారుడైన ఆయాన్‌ను దత్తత ఇచ్చారు. కొద్ది రోజుల కిందట ఇంట్లో గొడవ జరగడంతో ఆయాన్‌ను మందలించారు. దీంతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఆయాన్ వెళ్లిపోవడంతో విషయాన్ని అక్కకు చెప్పాడు. దీంతో నగరానికి వచ్చిన ఖాతూన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అలరించిన భక్తిరంజని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన కె. భవజ్ఞ బృందం ఆలపించిన భక్తిరంజని భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై భవిజ్ఞ బృందం పలు కీర్తనలకు ఆలపించింది. అనంతరం వారికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందచేశారు.

సజ్జల, రవిబాబులను విమర్శించే స్థాయి నరహరికి లేదు

ట్రైకార్ డైరెక్టర్ మద్దిల రామకృష్ణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ కుంభా రవిబాబులను విమర్శించే స్థాయి నరహరి ప్రసాద్‌కు లేదని ఏపీ ఎస్టీ కార్పొరేషన్ (ట్రైకార్) డైరెక్టర్ మద్దిల రామకృష్ణ (ఎమ్ఆర్‌కె) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సజ్జల, కుంభాలపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు నరహరి ప్రసాద్ ఇటీవల చేసిన నిరాధారమైన అసత్య ఆరోపణలను ఎమ్ఆర్‌కె తీవ్రంగా ఖండించారు. టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ఉన్నప్పుడు ఆ పదవిని అడ్డుపెట్టుకుని నరహరి చేసిన అక్రమాలు, గిరిజనులకు చేసిన అన్యాయాలు వారు మరిచిపోలేదని గుర్తు చేశారు. చంద్రబాబు మెప్పు కోసం చవుకబారు ఆరోపణలు చేస్తే గిరిజనులే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో శతాబ్ది ఉత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. నూరు వసంతాల మహోత్సవాలను తిలకించేందుకు భక్తులు లక్షలాదిగా తరలి వస్తున్నారు. పుణ్యక్షేత్ర ప్రాంగణమంతా యాత్రికులతో నిండిపోయింది. ఏలూరు రోడ్డులోని మేరీమాత అర్చివద్ద నుంచి పుణ్యక్షేత్ర ప్రధానాలయం, మేరీమాత స్వరూపం, కొండ శిఖరాగ్రం వరకు భక్త జనం బారులు తీరారు. దీంతో కొండ పై గల మెట్ల మార్గాలు, కాలిబాటలు కిక్కిరిసిపోయాయి. శిలువ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుణదల కొండ రాత్రి సమయాల్లో విద్యుద్దీప కాంతులతో కాంతులీనుతోంది. ఆదివారం ఉదయం 6:30 నుంచి రాత్రి 12 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఉదయపు ప్రార్థనలో పాల్గొన్న ఫాదర్లు



భక్తులకు సత్ప్రసాదం అందిస్తున్న ఫాదర్



గ్రౌండ్‌లో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

మల్లేశ్వరాలయ పనుల పరిశీలన

కుంభాభిషేకానికి సముద్ర, జీవనదుల జలాలు



మల్లేశ్వర స్వామి వారి ఆలయం పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో రమేష్‌బాబు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు శనివారం పరిశీలించారు. ప్రతిష్ఠోత్సవాలకు మరో మూడు రోజులే గడువు ఉండటంతో మిగిలిన అరకొర పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆలయానికి జరుగుతున్న ఎలక్ట్రికల్ పనులు, ఏసీ ఏర్పాటు తదితర పనుల గురించి సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం నటరాజ స్వామి వారి ఆలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న యాగశాల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, ఇతర ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు...

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ధ్వజ సహిత స్వర్ణ శిఖర ప్రాణ ప్రతిష్ఠోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కుంభాభిషేకాన్ని మూడు సముద్రాల జలాలతో పాటు పలు జీవనదుల జలాలను తీసుకొచ్చేందుకు వైదిక కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. దేశానికి మూడు వైపుల ఉన్న సముద్రాల జలాలతో పాటు పలు జీవనదుల నుంచి జలాలను అభిషేకం నిమిత్తం తీసుకురానున్నారు. ఇప్పటికే మూడు సముద్రాల జలాలతో పాటు కొన్ని నదుల జలాలను ఆలయ అర్చకులు తీసుకుని భద్రపరిచారు. తూర్పు వైపున ఒరిస్సాలోని కోణార్క్, దక్షిణం వైపున రామేశ్వరం, పడమర వైపున ద్వారక వద్ద సముద్ర జలాలను సేకరించారు. పవిత్ర జలాలను తీసుకొచ్చేందుకు అర్చక బృందం ఆయా ప్రాంతాలకు తరలివెళ్లింది. మహా కుంభాభిషేకం నిర్వహించే తరుణంలో అన్ని జలాలతో పాటు దుర్గాఘాట్ కృష్ణా జలాలను తీసుకుని మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఆలయ అర్చకులు ఊరేగింపుగా మల్లేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అత్యంత వైభవంగా ఉత్సవాల నిర్వహణకు కృషి చేస్తున్నారు.

పశ్చిమంలో భారీగా రహదారుల నిర్మాణం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆసిఫ్



శంకుస్థాపన చేస్తున్న షేక్ ఆసిఫ్, రాయన భాగ్యలక్ష్మి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చంద్రబాబు పాలనలో విచ్చలవిడి అవినీతి కారణంగా రోడ్లు దారుణంగా మారాయని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. నియోజకవర్గంలోని 53వ డివిజన్ సింగరాజువారివీధిలో రూ.31.17 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు ఆధ్వర్యంలో షేక్ ఆసిఫ్ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా అవినీతి జరిగిందని ధ్వజమెత్తారు. అందువలనే రోడ్లు నిర్మాణం చేసినా అవన్నీ మూణ్నాళ్ల ముచ్చటగా మారాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్లన్నీ దెబ్బతిని ఉండటంతో రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. వందల కోట్ల రూపాయల వ్యయంతో రహదారుల నిర్మాణం చేశామన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విజయవాడ నగరంలో దాదాపుగా అన్ని రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. ప్రధానంగా పశ్చిమ నియోజకవర్గంలో రోడ్లు అద్భుతంగా నిర్మించామని వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చైతన్యరెడ్డి, అర్షద్, మరుపిళ్ల రాజేష్, కోటిరెడ్డి, శిరంశెట్టి పూర్ణ, ఇర్ఫాన్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షులు విశ్వనాథ రవి, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, శ్రీశైలం దేవస్థానం పాలకవర్గ సభ్యుడు గురుమహంతు మహేష్, నాయకులు పడాల చిన్నా, కంచిబాబు, చాన్, సోల్జర్ కౌసర్, సమీర్, శేగు వెంకటేశ్వరరావు, నరహరిశెట్టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దాతలు సేవా గుణం అలవర్చుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, చలపతిరావు, బలరామకృష్ణమూర్తి

విజయవాడ కల్చరల్: దాతలు సేవా గుణం అలవర్చుకోవాలని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. నర్మదా అన్నదాన పుష్కర కమిటీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం అన్నదాతలకు సన్మానం, అన్నదాన మహాయజ్ఞ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ అన్నదాన సేవను నారాయణ సేవగా భావించాలని సూచించారు. పుష్కర సమయంలో వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్నదానం చేయడం సామాన్యమైన విషయం కాదన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. బ్రాహ్మణ సేవా సంఘం, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమైఖ్య గౌరవ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని పేర్కొన్నారు. శ్రీకంఠ రుష్యాశ్రమ పీఠాధిపతి శ్రీ కంఠ బాలాజీ మాట్లాడుతూ గతంలో గంగా పుష్కరాల సమయంలో లక్షలాది మందికి అన్నప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది మే ఒకటో తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే నర్మదా నది పుష్కరాలకు వచ్చే భక్తులకు నిరంతరం అన్నప్రసాదం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ కోసం నిర్వాహకులకు వెలంపల్లి లక్ష రూపాయల విరాళం అందజేశారు. అనంతరం నిర్వాహకులు దాతలను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, కార్పొరేటర్ శర్వాణీమూర్తి, అన్నదాన కమిటీ అధ్యక్షుడు టీవీ రమణమూర్తి, విజయవాడ శృంగేరీ పాదుకా క్షేత్రం అధ్యక్షుడు బీవీ చలపతిరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే ప్రజల అభీష్టం

ఎంపీ కేశినేని నాని



ఎంపీ కేశినేనికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని బహూకరిస్తున్న నాయకులు

విజయవాడస్పోర్ట్స్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ కేశినేని నాని అన్నారు. సీఎం జగన్ సారథ్యంలోని సంక్షేమ రాజ్యం కచ్చితంగా వస్తుందని తెలిపారు. విజయవాడలోని కేశినేని భవన్‌లో తిరువూరు నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులతో ఎంపీ కేశినేని శనివారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలను చర్చించారు. అదేవిధంగా పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. బూటకపు సర్వేలతో ప్రజలను ఆయోమయానికి గురిచేసేందుకు టీడీపీ ప్రయత్నిస్తుందని, అయితే వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని ఎంపీ అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలను ముందుండి నడిపించడమే గురుతర బాధ్యతగా తీసుకోవాలని నాయకులకు సూచించారు. కాకర్ల వైఎస్సార్ సీపీ నాయకులు నవీన్, పీఏసీఎస్ చైర్మన్ ముక్కామల సీతారామయ్య, తిరువూరు కౌన్సిలర్‌లు మోదుగ ప్రసాద్, పసుపులేటి శేఖర్‌బాబు, ఇనపనూరి చిన్నారిరవి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీ రామారావుకు స్వరాంజలి

విజయవాడ కల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సినీ నటుడు ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సినీ సంగీత విభావరి, గాయకుడు సునీల్‌కుమార్‌కు ఆత్మీయ పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రణవీ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు రాజు మాట్లాడారు.